నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 7 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ప్రత్యేకావసరాల పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ

వైద్యశిబిరంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి అశోక్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6 : ప్రత్యేకావసరాల పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జిల్లా విద్యాధికారి అశోక్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల పాఠశాలలో గుజరాత్ వుయ్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో వినికిడి లోపమున్న పిల్లలకు ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో 75 మందికి వినికిడి లోపమున్నట్లు గుర్తించామన్నారు. అలాగే 2 వేలకుపైగా ప్రత్యేకావసరాల పిల్లలను ఐఆర్పీలు గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి, విలీన విద్యా కమ్యూనిటీ మొబిలైజేషన్ కో ఆర్డినేటర్ కటకం మధుకర్, సమగ్ర శిక్షణ కో ఆర్డినేటర్ అబీద్ అలీ, ప్రధానోపాధ్యాయుడు సుభాష్, ఐఆర్పీలు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

తాండూర్, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. వంట సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

చెన్నూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాల్క సుమన్‌పై అక్రమ కేసులను ఎత్తేయాలి

బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

- చెన్నూర్‌లో ధర్నా.. రాస్తారోకో
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం

చెన్నూర్, ఫిబ్రవరి 6 : చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చెన్నూర్ పట్టణంలో ర్యాలీ తీసి తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ధర్నా, రాస్తారోకో చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిషలు కృషి చేసిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించినందుకు బాల్క సుమన్‌పై అక్రమంగా కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. వాటిని వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జడ్పీటీసీ మోతె తిరుపతి, మున్సిపాలిటీ కౌన్సిలర్లు తుమ్మ రమేశ్, రేవెల్లి మహేశ్, జోడు శంకర్, దోమకొండ అనిల్, జగన్నాథుల శ్రీను, కో-ఆప్షన్ సభ్యుడు అయ్యూబ్, కోటపల్లి మండల వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస రావు, ఎంపీటీసీ నాగవత్ శ్రీనువాస్, కోటపల్లి సింగల్‌విండో చైర్మన్ పెద్దపోలు సాంబగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, నాయకులు పెండ్యాల లక్ష్మణ్, మేడ సురేశ్‌రెడ్డి, బుర్ర రాకేశ్‌గౌడ్, నెన్నల భీమయ్య, అక్కెం బాపు, పెద్దల వెంకటేశ్, తగరం అశోక్, తగరం సంపత్, భూపాల లక్ష్మీనారాయణ, నారాయణ, ఎండీ నయాబ్, బోగే భారతి, కొం డపర్తి వెంకటరాజం, నాయకపు వినయ్, తాటికొండ సురేశ్, నిమ్మల సంతోష్, తలండి మురళి, కమటం మనోహర్, మల్లేశ్‌యాదవ్, విద్యాసాగర్, పల్లి సమ్మయ్య, మంత్రి రామయ్య పాల్గొన్నారు.

ఏసీ కోచ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6 : ఆసిఫాబాద్ డిపో నుంచి హైదరాబాద్‌కు రెండు లహరి సీటర్, స్లీపర్ ఏసీ కోచ్ బస్సులను ప్రారంభించామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎం శ్రీధర్ ఓ ప్రకటనలో కోరారు. ఆసిఫాబాద్ నుంచి ప్రతి రోజూ ఉదయం 9:30, రాత్రి 09:15 గంటలకు హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి ఉదయం 9, రాత్రి 8:30 గంటలకు ఆసిఫాబాద్‌కు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సీటర్ బస్‌కు రూ.850, స్లీపర్‌కు రూ.1180 చార్జి ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ కోసం www. tsrtconline.in వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

చంద్రాపూర్‌లో కార్గో సేవలు..

మహారాష్ట్రలోని చంద్రపూర్ బస్టాండ్‌లో టీఎస్ ఆర్టీసీ కార్గో సేవలను ప్రారంభించినట్లు డీఎం శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని, చంద్రపూర్ ఏజెంట్ ఫోన్ నం. 7972517548,8668208939లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మంచిర్యాల అంతర్గాం బ్రిడ్జికి బ్రేక్!

కేసీఆర్ సర్కారు హయాంలో శంకుస్థాపన.. ఉద్దేశపూర్వకంగానే పనులు నిలిపివేత

- ముల్కల్ల-మ్రుర్మూర్ మధ్యలో కొత్త వారధికి ప్రతిపాదన
- ల్యాండ్ సేకరణ, నిర్మాణ వ్యయం పెరుగుతున్నా.. ఎందుకో మరి?
- రియల్ ఎస్టేట్ వ్యాపారుల జేబులు నింపే వ్యవహారమంటూ ఆరోపణలు
- అంతర్గాం బ్రిడ్జితోనే మేలంటున్న ప్రజలు

మంచిర్యాల గోదావరి ఒడ్డున బ్రిడ్జి నిర్మించే స్థలం ఇదే

మంచిర్యాల, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జిల్లా కేంద్రంలోని ప్రజల చిరకాల వాంఛ అయిన మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జి నిర్మాణానికి బ్రేక్‌లు పడ్డాయి. ప్రయాణికుల సౌకర్యార్థం కేసీఆర్ సర్కారు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించగా, ఉద్దేశపూర్వకంగానే అడ్డుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జి నిర్మాణంతో కరీంనగర్, హైదరాబాద్‌కు వెళ్లే వాహనదారులకు 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ప్రస్తుతం కరీంనగర్‌కు బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వెళ్తే రెండు గంటల పడుతున్న ప్రయాణం.. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే అరగంట నుంచి 40 నిమిషాలు తగ్గుతుంది. సమయం తగ్గడంతో పాటు వ్యయప్రయాసలు కూడా తగ్గుతాయనే సద్దుదేశంతో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఎంతగానో కష్టపడి బ్రిడ్జిని మంజూరు చేయించారు. రూ.164 కోట్లతో ఈ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలిచారు. మంచిర్యాల జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా స్వయంగా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పనులను ప్రారంభించారు. ఈ మేరకు గోదావరిలో సాయిల్ టెస్టులు నిర్వహించి, గౌతమేశ్వర ఆలయానికి సమీపంలో బ్రిడ్జి నిర్మాణానికి గుంతలు కూడా తీశారు. కాగా టెండర్ దక్కించుకున్న కంపెనీకి కొన్ని పాత బిల్లులు రావాల్సి ఉండడం.. అవి వచ్చాక పనులు చేద్దామనే ఆలోచనలో ఉండగా, అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు ముందుకు సాగలేదు.

తెరపైకి కొత్త ప్రపోజల్..?

ఎన్నికలు డిసెంబర్‌లో ముగిశాయి. జనవరిలోనైనా పనులు మొదలవుతాయని ఆశపడిన మంచిర్యాల ప్రజలకు నిరాశే మిగిలింది. మంచిర్యాల జిల్లాకే తలమానికంగా నిలుస్తుందనుకున్న ఈ బ్రిడ్జిని కాదని, ముల్కల్లకు దీన్ని తరలించే ఆలోచనలో కొత్త ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తున్నది. ముల్కల్ల నుంచి గోదావరి ఆవల ఉన్న మ్రుర్మూర్‌కు బ్రిడ్జి కట్టాలనే ప్రతిపాదనను కొత్తగా గెలిచిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అధికారుల ముందు పెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా పడి బయటికి రావడంతో మంచిర్యాల జిల్లావాసులు మండిపడుతున్నారు. మంచిర్యాల దాటుకొని ముల్కల్ల దాకా వెళ్లి బ్రిడ్జి ఎక్కాల్సిన అవసరం ఏం ఉందని ప్రశ్నిస్తున్నారు. మంచిర్యాలకు సంబంధించి హాజీపూర్ మండల కేంద్రం నుంచి మంచిర్యాలతో పాటు ఆసిఫాబాద్ జిల్లా వాసులు అందరూ మంచిర్యాల మీదుగానే కరీంనగర్, హైదరాబాద్‌కు వెళ్తుంటారు. అదే లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం వాసులు లక్షెట్టిపేట మీదుగా కరీంనగర్ వెళ్తారు. ఆ ఏరియా నుంచి మంచిర్యాల దాకా ఎవరూ.. రారు. అలాంటప్పుడు జిల్లా కేంద్రం శివారులోనే బ్రిడ్జి ఉంటే బాగుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల నుంచి అంతర్గాం వరకు దాదాపు 20 కిలోమీటర్ల దూరభారం తగ్గుతుంది. అదే ముల్కల్ల-మ్రుర్మూర్ బ్రిడ్జితో అయితే మంచిర్యాల నుంచి ముల్కలకు వెళ్లి అక్కడి నుంచి మ్రుర్మూర్ వెళ్లి, అక్కడి నుంచి అంతర్గాంకు రావాల్సి ఉంటుంది. ముక్కు ఎక్కడ ఉందంటే చుట్టూ తిప్పి చూపించినట్లు.. ఉంటుంది. 30 నుంచి 35 కిలోమీటర్ల దూరం పెరగడంతో పాటు సమయం కూడా వృథా అవుతది. ముల్కల్ల దాకా పోయే బదులు ఇప్పుడు ఏదైతే ఇందారం క్రాస్ రోడ్డు నుంచి వెళ్లే మార్గం ఉందో అదే బాగుంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. పైగా కొత్త ప్రతిపాదన ప్రకారం బ్రిడ్జి నిర్మించాలంటే ముల్కలతో పాటు అటు మ్రుర్మూర్‌లోనూ భూ సేకరణ చేయాలి. బ్రిడ్జి నిర్మాణ వ్యయం సైతం ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. అదే మంచిర్యాల- అంతర్గాం వరకు ఎలాంటి ఇబ్బందులుండవు. ఇప్పుడున్న రోడ్లకు కనెక్టివిటీ ఏర్పాటు చేసుకుంటే సరిపోతది.

ఎవరి ప్రయోజనం కోసమో..!

ఎలా చూసినా ముల్కల్ల దగ్గర కొత్త ప్రతిపాదనకంటే ఇప్పటికే టెండరైన పాత ప్రతిపాదన ప్రకారం బ్రిడ్జి నిర్మించడం మంచిదనే అభిప్రాయాలు ఆర్‌అండ్‌బీ అధికారులే వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల పట్టణం చుట్టూ వచ్చే 100 ఫీట్ల రోడ్డుకు దీన్ని అనుసంధానిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు కూడా ఉండవని చెబుతున్నారు. ఇది గతంలో ఉన్న ప్రతిపాదనే కాబట్టి ఎలాంటి సమస్యలు వచ్చే ఛాన్స్ లేదు. కానీ కావాలనే ఉద్దేశ పూర్వకంగా బ్రిడ్జిని తరలిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ముల్కల్ల, వేంపల్లి శివారుల్లో రియల్ ఎస్టేట్ బడా వ్యాపారులు ఉండడం, ఇప్పటికే ఎన్‌హెచ్-63 సైతం అక్కడి నుంచే వెళ్తుండడం తాజాగా ఈ బ్రిడ్జిని కూడా అటువైపే తరలిస్తామనడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికే వేంపల్లి నుంచి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మీదుగా వెళ్లే రహదారి ఒకటి ఉంది. ముల్కల్ల వద్ద బ్రిడ్జి కట్టే బదులు దాన్నే వాడుకోవచ్చు కదా అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం బడా రియల్ ఎస్టేట్ వ్యాపారుల జేబులు నింపేందుకు కొత్త ప్రతిపాదన తెరపైకి తీసుకువస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి ఇలాంటి పరిస్థితుల్లో ఈ విషయంపై ఎలా ముందుకు వెళ్తారనేది తేలాల్సి ఉంది.

అధికారికంగా ఆదేశాలు లేవు..

గోదావరిపై ముల్కల్ల దగ్గర బ్రిడ్జి నిర్మించాలనే చర్చ జరిగిన మాట వాస్తవమే. కానీ ఇప్పటి వరకు అధికారికంగా దానిపై ఎలాంటి ఆదేశాలు లేవు. మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జి టెండరైతే పూర్తయ్యింది. సాయిల్ టెస్టు కూడా చేశారు. కొన్ని బిల్లులు పెండింగ్ ఉండడంతో నిర్మాణ సంస్థ పనులను మొదలుపెట్టకుండా ఆపేసింది. ఈ బ్రిడ్జి విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

- నర్సింహాచారి, ఆర్‌అండ్‌బీ ఈఈ, మంచిర్యాల

ఎంపీ సీటు లేనట్లేనా?

గడ్డం వివేక్, గడ్డం వంశీలకు కోలుకోలేని దెబ్బ

- కాంగ్రెస్‌లో ఎంపీ వెంకటేశ్‌నేతకాని చేరికతో ఆవిరైన ఆశలు
- కుటుంబ పాలన పేరిట రేసు నుంచి తప్పించే ప్లాన్
- ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపిస్తున్నది ఎవరు?
- అధిష్ఠానం నిర్ణయానికి సపోర్టు చేయడమా.. లేక కుమారుడి కోసం ఫైట్ చేయడమా..?

మంచిర్యాల, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పెద్దపల్లి ఎంపీ టికెట్‌పై చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఆయన కుమారుడు గడ్డం వంశీ పెట్టుకున్న ఆశలు ఆవిరైపోయినట్లేనని.. తాజా పరిణామాలను బట్టి చూస్తే అర్థమవుతున్నది. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేతకాని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడంతో గడ్డం ఫ్యామిలీకి రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తగిలినట్లైంది. వివేక్ అత్యాశే ఆయన కుమారుడి రాజకీయ భవిష్యత్తును తుంగలో తొక్కేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీని వదిలి కాంగ్రెస్‌లో చేరినప్పుడు వివేక్‌కు చెన్నూర్ ఎమ్మెల్యే టికెట్‌తో పాటు ఆయన కుమారుడు వంశీకి పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇస్తామనే హామీ.. అటు అధిష్ఠానం నుంచి, ఇటు రేవంత్‌రెడ్డి నుంచి వచ్చినట్లు ప్రచారం జరిగింది. దాన్నే చాలా మంది కాంగ్రెస్ నాయకులు బలపరచడంతో వివేక్ జాక్‌పాట్ కొట్టారనుకున్నారంతా.. కానీ ఎమ్మెల్యేగా గెలిచాక మంత్రి పదవి రేసులోకి వివేక్ రావడంతో అన్నీ ఆయనకే కావాల్నా, మేము ఏమి పోవాలనే భావన మిగిలిన సీనియర్ ఎమ్మెల్యేల్లో పెరిగింది. ఈ విషయంలోనే మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్(ప్రేమ్‌సాగర్ రావు)కు గడ్డం వివేక్‌కు దూరం పెరిగినట్లు తెలుస్తుంది. అప్పటి నుంచి వీరిద్దరూ ఎడముఖం, పెడముఖంగా ఉంటూ వస్తున్నారు. వివేక్‌కు మంత్రి పదవి విషయంలో స్వయంగా ఆయన అన్న మాజీ మంత్రి.. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సైతం అప్పట్లో అలకపూనినట్లు వార్తలు వచ్చాయి. కానీ అధిష్ఠానం చేసిన మొదటి మంత్రివర్గ విస్తరణలో జిల్లా నుంచి ఎవరికీ అవకాశం రాలేదు. ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా సీతక్కను నియమించారు. దీంతో ఒకరి కారణంగానే మరొకరికి మంత్రి పదవి మిస్ అయ్యిందనే పరస్పర కోపాలు ఎమ్మెల్యేల మధ్య పెరిగిపోయాయి.

తలో 'చెయ్యే'సి..

గడ్డం వివేక్ వచ్చాక జిల్లా కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు మరింత ఎక్కువయ్యాయి. ఎమ్మెల్యేలకు ఒకరంటే ఒకరు పడకపోవడం.. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకుల్లోనూ చీలికలు తీసుకువచ్చాయి. మంచిర్యాలలో ఉండే కీలక నాయకులు సైతం పీఎస్సార్‌ను కాదని వివేక్ దగ్గరకు వెళ్తున్నారు. కొందరు వివేక్‌ను కాదని పీఎస్సార్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. సరిగ్గా ఇదే టైమ్‌లో కుటుంబ పాలన అనే ప్రశ్న మొదలైంది. బెల్లంపల్లిలో గడ్డం వినోద్‌కు, చెన్నూర్‌లో గడ్డం వివేక్‌కు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. పెద్దపల్లి ఎంపీ టికెట్ సైతం వారి కుమారుడైన గడ్డం వంశీకి ఇస్తే అది కుటుంబ పాలన కాకపోతే ఏమవుతుందనే చర్చ ప్రజల్లో మొదలైంది. పైగా రెండు ఎమ్మెల్యేలతో పాటు ఎంపీ హామీ ఉన్నప్పటికీ గడ్డం బ్రదర్స్ మంత్రి పదవి కోసం ఎవరి స్థాయిలో వారు పైరవీలు చేయడం కాంగ్రెస్ రాష్ట్రస్థాయి నాయకత్వంలోనే కొందరు నాయకులకు నచ్చలేదట. దీంతో కుటుంబ పాలన పేరు చెప్పి ఎంపీ రేసు నుంచి గడ్డం కాక వారసుడని తప్పించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇస్తామనే హామీతోనే ప్రస్తుత ఎంపీ వెంకటేశ్ నేతను కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నట్లు తెలుస్తున్నది. ఈ మొత్తం వ్యవహారంలో మంచిర్యాలకు చెందిన ఆ ముఖ్య నాయకుడితో పాటు రాష్ట్రస్థాయిలో వివేక్ వ్యతిరేక వర్గం కీలకంగా వ్యవహరిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

మరి గడ్డం వివేక్‌కు ఇచ్చిన హామీ..

పార్టీలో చేరినప్పుడే గడ్డం వంశీకి పెద్దపల్లి ఎంపీ టికెట్‌పై స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో వివేక్ ఎమ్మెల్యేగా గెలిచాక ఎలాగైనా ఎంపీ టికెట్ తన కొడుక్కే వస్తుందనే ధీమాతో ఉన్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పనులు కూడా చేసుకుంటున్నారు. కాక పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తూ యూత్‌ను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొడుక్కి ఎంపీ టికెట్ రావాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్‌లో తనకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకున్నా వివేక్ ఓపికతో ఉంటున్నట్లు తెలుస్తుంది. ఎన్ని అవమానాలు ఎదురైనా భరిస్తూ, ఎంపీ టికెట్ కోసం ఫైరవీలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ఇటీవలే వంశీతో ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు సైతం చేయించారు. కానీ తాజాగా వెంకటేశ్‌నేత చేరికపై వివేక్ ఎలా ముందుకు వెళ్తారు. కొడుకు రాజకీయ భవిష్యత్తును ఫణంగా పెట్టి అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇస్తే వారికి సపోర్టు చేస్తారా.. లేక తనకు ఇచ్చిన హామీ మేరకు టికెట్ వంశీకే ఇవ్వాలని ఫైట్ చేస్తారా.. అనేది తేలాల్సి ఉంది.

మున్సిపల్ చైర్‌పర్సన్ క్షమాపణ చెప్పాలి

- కౌన్సిలర్ల డిమాండ్.. బైఠాయింపు

పోడియం వద్ద నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6 : చిల్లరగాళ్లంటూ తమను కించపరిచేలా మాట్లాడిన మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత క్షమాపణ చెప్పాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మొదటిసారిగా హాజరయ్యారు. కౌన్సిలర్లు పట్టణ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చైర్‌పర్సన్ కౌన్సిలర్లకు తెలియకుండా పలు అక్రమాలకు పాల్పడ్డారని, మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్యేకు వివరించారు. మాజీ కౌన్సిలర్ యూసఫ్ అనారోగ్యంతో మృతి చెందగా, అందరం కలిసి డబ్బులు సమకూర్చి చైర్‌పర్సన్‌కు ఇస్తే.. ఆమె బాధిత కుటుంబానికి అందించలేదని మండిపడ్డారు. దీంతో చైర్‌పర్సన్ జోక్యం చేసుకొని చిల్లర కౌన్సిలర్లు అని ఎమ్మెల్యేకు చెబుతుండగా.. కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కార్యాలయం పోడియం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ క్షమాపణలు చెబితేనే ఆందోళన విరమింపజేస్తామని స్పష్టం చేశారు. దీంతో శ్వేత కలగజేసుకొని తాను కించపరిచేలా మాట్లాడలేదని, అలా మాట్లాడితే క్షమించాలని కోరడంతో.. వారు ఆందోళన విరమించారు.

మహిళల రక్షణకే భరోసా సెంటర్

- ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య, మోహన్

వర్చువల్‌గా భరోసా కేంద్రాలను ప్రారంభిస్తున్న డీజీపీ రవిగుప్తా

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 6 : మహిళల రక్షణ కోసమే భరోసా సెంటర్(ఉమెన్ అండ్ చైల్డ్)ను ఏర్పాటు చేశామని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య, మోహన్ కోరారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 8 భరోసా కేంద్రాలను డీజీపీ రవిగుప్తా వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ మేరకు సీసీసీ టౌన్‌షిప్‌లోని పాత పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్‌ను ఏసీపీలు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మహిళలకు సంబంధించిన చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఈ కేంద్రం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఈ సెంటర్‌లో మహిళా ఎస్ఐతో పాటు లీగల్ అడ్వైజర్, హెల్త్ సిబ్బంది, రిసిప్షనిస్ట్ అందుబాటులో ఉంటారని తెలిపారు. 24 గంటల పాటు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ప్రవీణ్‌కుమార్, ఆకుల అశోక్, సుధాకర్, బన్సీలాల్, దేవయ్య, శ్రీనివాస్, రవీందర్, నరేశ్, సీసీసీ నస్పూర్ ఎస్ఐ రవికుమార్, భరోసా కేంద్రం ఇన్‌చార్జి, ఎస్ఐ హైమా, లీగల్ అడ్వైజర్ కనుకుంట్ల నవ్యక్రిష్ణ, సపోర్ట్‌పర్సన్ పుష్పలత, మెడికల్ సపోర్టర్స్ సురమల్ల ప్రమీల, రిసిప్షనిస్ట్ ఐత రజిత పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లకే మొదటి శంకుస్థాపన

- వాట్సాప్‌లో ట్రోల్ అవుతున్న మంద్రమర్రి శిలాఫలకం

మంచిర్యాల, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో గెలవడం కోసమని ఎన్నో హామీలు ఇచ్చింది. ఇదే సమయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు ని యోజకవర్గాల్లో ప్రత్యేకమైన హామీలు ఇచ్చారు. ఈ క్రమంలోనే చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ సైతం తాను గెలిస్తే నియోజకవర్గంలోని 40 వేల మందికి ఉద్యోగాలు ఇస్తానని, చెన్నూర్‌కు మైనింగ్ ఇనిస్టిట్యూట్ తెస్తానని, మూడు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తానని.. ఇలాంటి హామీలెన్నో ఇచ్చారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచాక ముందు ఏదైనా హామీని అమలు చేస్తారని అంతా భావించారు. కానీ ఆయన మాత్రం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ తప్ప పెద్దగా చేసిందేమీ లేదు. పోనీ.. ఎమ్మెల్యేగా మొట్టమొదట ఏదైనా మంచి అభివృద్ధి పనిని మొదలు పెడతారు అనుకుంటే.. మందమర్రి పట్టణంలో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి తొలి శంకుస్థాపన చేశారంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఈ శంకుస్థాపనకు ముఖ్య అతిథులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎంపీ వెంకటేశ్‌నేత అనే పేర్లతో ఉన్న శిలాఫలకాన్ని వాట్సాప్‌లలో తెగ షేర్ చేస్తున్నారు.

గ్రంథాలయ నిర్మాణం త్వరగా పూర్తవ్వాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6 : జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ నూతన భవనాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు,కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీనాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆరుగురు ఫారెస్ట్ అధికారుల సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన సీసీఎఫ్ శాంతారాం

మంచిర్యాల ఏసీసీ/జన్నారం/కెరమెరి, ఫిబ్రవరి 6 : ఉమ్మడి జిల్లాలో ఆరుగురు ఫారెస్ట్ అధికారులను మంగళవారం సస్పెన్షన్ చేశారు. అటవీశాఖ మంచిర్యాల జిల్లా జన్నారం డివిజన్‌లోని ఇందన్‌పెల్లి రేంజ్ కవ్వాల్ సెక్షన్ ఆఫీసర్ అఫ్జల్ ఖాన్, ఎఫ్‌బీవో శ్రీధర్, ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్ రేంజ్ పరిధిలోని కొత్తపెల్లి ఎఫ్ఎస్‌వో వినయ్ కుమార్, ఎఫ్‌బీవో ఇమ్రాన్, నిర్మల్ జిల్లా ఉడుంపూర్ రేంజ్ ఇస్లాంపూర్ ఎఫ్ఎస్‌వో రవికుమార్, ఎఫ్‌బీవో భూమేశ్‌లను సస్పెన్షన్ చేశారు. మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో టేకు చెట్ల నరికివేత జరిగినందున అటవీ శాఖ ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు మంచిర్యాల ఫ్లయింగ్ స్కాడ్ డీఎఫ్‌వో వినయ